ఈ వారం కథ:

# అమ్మ మనసు

## -చీర్ల రాజేంద్రప్రసాద రెడ్డి

అమ్ములుకో సమస్య వచ్చిపడింది!

"మనిషనేవాడికి ఏదో ఒక సమస్య వుంటుంది. అటువంటిది అమ్ములుకు సమస్య వచ్చిపడటంలో వింతేముంది" అని ఎవరైనా అనుకోవచ్చు. కానీ అమ్ములు ఆ సమస్యని తన జీవితంలో ఎదురైన అతి క్లిష్ట సమస్యగా భావిస్తోంది. అదే అసలు సమస్య.

అమ్ములు కొచ్చిన సమస్య ఏమిటో తెలుసుకునేముందు అమ్ములు గురించి తెలుసుకోవటం అవసరం.

మధ్యతరగతికి చెందిన దిగువ శ్రేణి కుటుంబంలో పుట్టిన అమ్ములు స్కూలు ఫైనల్ పరీక్ష ఫెయిలవడంతో విద్యార్థినిగా కంటే గృహిణిగా రాణిస్తుందనే వుద్దేశ్యంతో తల్లిదండ్రులు ఆమెను ఆల్విన్‌లో ఫిట్టర్‌గా పనిచేస్తున్న యాదగిరి కిచ్చి పెళ్ళిచేశారు. మొదటి మూడేళ్ళ దాంపత్య జీవితం ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా సాగింది. దాని ఫలితమైన 'బాబు' రెండో పుట్టినరోజున ఆమె ప్రస్తుత సమస్యకు బీజం పడింది.



ఆరోజు- మ్యాట్నీ చూసి, ఇంటికి రావటానికి బస్ కోసం ఎదురుచూస్తున్నారు అమ్ములూ, యాదగిరి. ఎంతసేపటికి వాళ్ళు ఎక్కాల్సిన బస్సు రాలేదు. బాబు పాల కోసం ఏడిస్తే బస్టాప్‌లో బెంచి మీద కూర్చుని పాలివ్వసాగింది అమ్ములు. అయిదు నిమిషాల తర్వాత ఎందుకో అనుమానం వచ్చి పక్కకు చూసింది. పాతికేళ్ళ వ్యక్తి ఒకతనూ, నలభై యేళ్ళ వ్యక్తి ఒకతనూ తన రొమ్ముల వైపు ఆబగా చూస్తూ వుండటం గమనిస్తూనే ఒక్కసారిగా సిగ్గుతో కుచించుకుపోయింది. వెంటనే పాలివ్వడం ఆపుచేసి, జాకెట్ హుక్స్ పెట్టుకుని, బాబు ఏడుస్తున్నా పట్టించుకోకుండా భుజాన వేసుకొంది.

కొన్ని కొన్ని సంఘటనలు చిన్నవైనా కొందరిపైన విపరీతమైన ప్రభావాన్ని చూపిస్తాయి. దానికి స్పష్టమైన కారణాలంటూ వుండకపోవచ్చు. అమ్ములు విషయంలోనూ అదే జరిగింది.

అప్పటివరకూ పబ్లిక్ ప్లేస్‌లో బాబుకి పాలిచ్చేటప్పుడు ఆమె పెద్దగా పరిసరాల్ని పట్టించుకునేది కాదు. పై సంఘటనతో ఆమెలో స్త్రీత్వం పూర్తిగా మేల్కొంది. అదే ఆమెకు సమస్య అయి కూర్చుంది.

ఆ సంఘటన జరిగిన తర్వాత సినిమాలనీ, సర్కసనీ నాలుగయిదుసార్లు వాళ్ళు బయటకు వెళ్ళటం జరిగింది. బాబుకి పూర్తిగా పాలిచ్చి బయల్దేరేది అమ్ములు. అయినా వాళ్ళెక్కవలసిన నెంబరు బస్ రాకపోవటం వల్ల ఆలస్యం అయ్యో, లేదా ఆకలేసో బాబు ఏడుపు మొదలుపెట్టేవాడు. తప్పని పరిస్థితులలో బాబుకి పాలు ఇవ్వవలసి వచ్చేది అమ్ములుకి.



అమ్ములు ఎర్రగా, బొద్దుగా వుంటుంది. అందులోనూ యవ్వనం తాలూకు పూర్తి ఆకర్షణ ముఖంలో నిక్షిప్తమై వుండడంతో ఎక్కడ వున్నా ఆమె రూపం మగాళ్ళను ఇట్టే ఆకర్షిస్తుంది. బాబుకి పాలిస్తున్నప్పుడు చుట్టూ వున్న మగాళ్ళందరూ తననే చూస్తుంటారనే భావన ఆమెలో పూర్తిగా నాటుకుపోయింది దాంతో.

గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆమె ఒక నిర్ణయం తీసుకుంది. ఆమె 'బాబు'కి చనుబాలు అలవాటు తగ్గే వరకూ వీలైనంత వరకూ బయటకు వెళ్ళటం పూర్తిగా మానివేయటం!

* * *

"అమ్ములూ, ఇవాళ చిరంజీవి సినిమా రిలీజ్. త్వరగా తయారవ్వు. అమరావతికి వెళదాం. వంట వచ్చాక చెయ్యొచ్చు" అన్నాడు యాదగిరి ఫ్యాక్టరీ నుండి వస్తూనే.

"నాకివాళ వీలు పడ్డు. నువ్వెళ్ళు" అంది అమ్ములు.

"నిన్ను ఇంటికాడ వదిలేసి నేనెప్పుడైనా సినిమాకి వెళ్ళానా? నువ్వొస్తే టిక్కెట్టు కూడా సులువుగా దొరుకుతుంది. అయినా సినిమా అంటే ఎగిరి గంతేసే దానివి ఇవాళ ఇలా అంటున్నావేటి?" అన్నాడు యాదగిరి.

అమ్ములు ఇబ్బందిలో పడింది. బావకి తన సమస్య అర్థం కాదు. ఇప్పుడు తను రానంటే బావ మానేస్తాడు. అదీ గాక తనక్కూడా చూడాలనే వుంది.

బాబుకి పూర్తిగా పాలిచ్చి, సీసాలో పోత పాలు పోసి బయల్దేరింది.

సినిమా చూసి, బస్టాప్‌కి వచ్చారు.

"నువ్వు ఎక్కవలసిన రైలు ఒక జీవితకాలం లేటు" అన్న మాటని నిజం చేసేట్టూ వాళ్ళు ఎక్కవలసిన బస్సు ఎంతసేపటికీ రాలేదు. ఆకలేసి, బాబు పాల కోసం ఏడవసాగాడు.

దాంతో పాలసీసా నోటికందించింది.



అవి పోతపాలని అర్థం అయినట్టు పక్కకి నెట్టేసాడు పీసాని. భర్త వైపు చూసింది నిస్సహాయంగా. పాన్ నములుతూ, బస్సు వచ్చే వైపు చూస్తున్నాడు యాదగిరి. అన్ని హాళ్ళు వదిలేసారేమో స్టాప్ రద్దీగా వుంది. అప్పటికే నలుగురయిదుగురు ఆమిప్పుడు ఏం చేస్తుందోనని ఉత్సాహంగా గమనించసాగారు. ఆమె భయపడుతున్న ప్రమాదం రానే వచ్చింది.

బాబు ఏడుపు శృతి మించింది. పాలపీసా మళ్ళీ నోట్లో పెట్టింది. ఈసారి వాడి ప్రతిస్పందన పిల్లల్లోని సహజసిద్ధమైన ఇన్‌స్టింక్ట్స్‌ని గుర్తుకు తెచ్చేలా దాన్ని విసిరికొట్టాడు. అమ్ములు గతుక్కుమంది. దాంతో బాబు చీర కొంగు లాగసాగాడు. ఏడుపు ఇంకా ఎక్కువైంది.

స్టాప్‌లోని మగాళ్ళందరూ తన వంకే చూస్తున్నారు. ఇప్పుడేం చెయ్యాలి? ఏదైనా అద్భుతం జరిగి తనీ స్థితి నుంచి బయటపడితే బావుండును. అలాంటి అద్భుతం ఏదీ బయట నుంచి జరగలేదు కానీ, తనలోంచే జరిగింది!

సినిమాల్లో హీరో హఠాత్తుగా మెషీన్ గన్‌తో ప్రత్యక్షమైనట్టు ఆమెకు ఒక్కసారిగా ధైర్యం కలిగింది. జాకెట్ హుక్స్ తీసి, బాబును రొమ్ముకు హత్తుకుంది. కేరింతలు కొడుతూ బాబు పాలు తాగుతుంటే, ఆ తల్లి మనసు పులకించిపోయింది. అప్పుడు అనుకుంది మనసులో స్థిరంగా.

వీళ్ళు చూస్తున్నారని తన బిడ్డకు పాలివ్వడానికి తనెందుకు సిగ్గుపడాలి? ఈ మగ సచ్చినోళ్ళంతా ఇంతే. పరాయాడది కనపడితే చాలు తినేసాలా చూస్తారు. ఈళ్ళూ ఓ ఆడదానికి పుట్టినోళ్ళు కారా? చిన్నప్పుడు పాలు తాగలేదా? ఏ పోయేకాలం వస్తుందో ఏమో పెద్దయ్యాక ఇలా తయ్యారవుతారు. సిగ్గ పడాల్సింది తను కాదు, చిన్నప్పుడు చనుబాలు తాగిన విషయాన్ని మర్చిపోయి, తమ పిల్లలకి పాలిస్తోన్న తల్లుల్ని కామ వికారమైన ఆలోచన నింపుకుని చూసే మగాళ్ళంగరూ సిగ్గు పడి చావాలి... అనుకుంది. తనను చూస్తున్న వాళ్ళకేసి ధైర్యంగా చూసింది.

అమ్ములు పెద్దగా చదువుకుని వుండకపోవచ్చు. గొప్ప వ్యక్తిత్వాన్ని కలిగి వుండకపోవచ్చు. అయితే తన బిడ్డ ఆలనా పాలనలకు సంబంధించి ఆమెలో ఎటువంటి ఇన్‌హిబిషన్సూ (సంకోచాలు) లేవు. బహుశా ప్రతి తల్లిలోనూ ఆ సహజ జ్ఞానం వుంటుందేమో.

◆ అనవసరంగా...

"మనిద్దరం కల్సి నానీని అనవసరంగా ఇవాళ కొట్టాం. ఎల్లుండి కొడితే బాగుండేది" దిగులుగా అన్నాడు బుజ్జి.

"ఏం? ఇప్పుడేమైంది?" ప్రశ్నించాడు చంటి.

"రేపు వాడి బర్త్‌డేట. మన్ని పిలవడు" మరింత దిగులుగా చెప్పాడు బుజ్జి.

– గొల్లపూడి శైలజ

